APTEL/26/A4232

కందేరి వాయువేగ

దినపత్రిక

ప్రజల చేతిలో ఆయుధం

విలేకరులు కావలెను

వాయువేగ

దినపత్రిక

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని
అన్ని మండలాలకు విలేకరులు కావలెను

అర్హత:
• తెలుగు భాష పై పట్టు

కావలసిన వారు:
- వార్తా రచనపై ఆసక్తి ఉండాలి
- స్థానిక ప్రాంతాలపై అవగాహన ఉండాలి
- నిబంధనతో, బాధ్యతతో పని చేయగలగాలి

ఆంధ్రప్రదేశ్ లోని అన్ని మండలాలకు

సంప్రదించండి 98660 98622

వాయువేగ దినపత్రిక – ప్రజల గళాన్ని ప్రజలకు చేరవేసే వేదిక

ప్రచురణ: తిరుపతి | సంపాదకుడు: కందేరి కార్తీక్ | సంపుటి : 01 | సంచిక : 134 | 10 గురువారం సెప్టెంబర్ , 2026 | పేజీలు :04 | వెల: రూ. 2.00

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు

- సాలకట్ల, నవరాత్రి బ్రహ్మోత్సవాల బుక్లెట్ ఆవిష్కరణ
- భక్తుల కోసం ఉత్సవాల పూర్తి వివరాల విడుదల
- వైభవంగా నిర్వహణకు టీటీడీ ఏర్పాట్లు

తిరుమల, సెప్టెంబర్ 9, (వాయువేగ న్యూస్)

తిరుమల శ్రీవారి సాలకట్ల, నవరాత్రి బ్రహ్మోత్సవాల నిర్వహణకు టీటీడీ విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. ఈ నేపథ్యంలో 2026 సంవత్సరానికి సంబంధించిన బ్రహ్మోత్సవాల బుక్లెట్‌ను తిరుమల అన్నమయ్య భవనంలో జరిగిన టీటీడీ పాలకమండలి సమావేశం సందర్భంగా ఆవిష్కరించారు. బ్రహ్మోత్సవాల నిర్వహణ, వాహన సేవలు, ప్రత్యేక ఉత్సవాల వివరాలను భక్తులకు అందుబాటులో ఉంచేందుకు ఈ బుక్లెట్‌ను రూపొందించారు. టీటీడీ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం సాలకట్ల బ్రహ్మోత్సవాలు సెప్టెంబర్ 15 నుంచి 23 వరకు జరగనున్నాయి. అనంతరం నవరాత్రి బ్రహ్మోత్సవాలు అక్టోబర్ 12 నుంచి 20 వరకు నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాల సందర్భంగా తిరుమలకు భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

మైలవరంలో ఆలయ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి

మైలవరం, సెప్టెంబర్ 9, (వాయువేగ న్యూస్)

ఎన్టీఆర్ జిల్లా మైలవరం నియోజకవర్గంలో పర్యటించడం తనకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. పర్యటనలో భాగంగా ద్వారకాతిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారి దత్తత ఆలయమైన మైలవరం శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని స్వామివారిని ప్రార్థించినట్లు పేర్కొన్నారు. ఆలయ దర్శనం అనంతరం వేద పండితుల ఆశీర్వచనాలు స్వీకరించిన మంత్రి, ఆధ్యాత్మిక వాతావరణం తనకు విశేష అనుభూతిని కలిగించిందన్నారు. భక్తుల ఆధ్యాత్మిక అవసరాలను తీర్చే కేంద్రాలుగా దేవాలయాలు నిలుస్తున్నాయని, వాటి పరిరక్షణతో పాటు అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని వివరించారు. తదుపరి మైలవరంలో సుమారు రూ.4 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణ మండపాన్ని స్థానిక శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణ ప్రసాద్‌తో కలిసి ఘనంగా ప్రారంభించారు. ఈ కల్యాణ మండపం ద్వారా భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఆలయాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి స్పష్టం చేశారు. దేవాలయాలకు వచ్చే భక్తులకు అవసరమైన మౌలిక వసతులు, తాగునీరు, పారిశుధ్యం, విశ్రాంతి సదుపాయాలు, ఇతర సౌకర్యాలను కల్పించేందుకు ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తున్నామని చెప్పారు.

- రూ.4 కోట్లతో నిర్మించిన కల్యాణ మండపం ప్రారంభం
- ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని వెల్లడి
- మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి

తుది దశకు పెదపెంకి అభివృద్ధి పనులు

- రూ.4.68 కోట్లతో గ్రామాభివృద్ధి పనులు
- రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం దాదాపు పూర్తి
- ప్రజల సౌకర్యాలకు పెద్దపీట వేయాలని పవన్ కళ్యాణ్ ఆదేశం

పార్వతీపురం మన్యం, సెప్టెంబర్ 9, (వాయువేగ న్యూస్)

పార్వతీపురం మన్యం జిల్లా పెదపెంకి గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులు తుది దశకు చేరుకున్నాయి. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని అధికారులతో సమీక్షించారు. ప్రజలకు కల్పించే సదుపాయాలు దీర్ఘకాలం ఉపయోగపడేలా ఉండాలని, నిర్మాణాల్లో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. గ్రామాభివృద్ధి కోసం రూ.4.68 కోట్లతో చేపట్టిన పనుల్లో 27 అంతర్గత సిమెంటు రోడ్లు, 12 సిమెంటు డ్రెయిన్లు, ఆరు డ్రెయిన్ కమ్ రోడ్ల నిర్మాణ పనులు పూర్తయ్యాయి. గ్రామంలోని వివిధ వీధులు, కాలనీల్లో చేపట్టిన ఈ పనులు ప్రజల రాకపోకలను సులభతరం చేయడంతో పాటు పారిశుధ్య పరిస్థితులను మెరుగుపరిచినట్లు అధికారులు తెలిపారు. గ్రామంలో నిర్మించిన సీసీ రోడ్లు, డ్రెయిన్లు మౌలిక వసతుల అభివృద్ధికి దోహదపడుతున్నాయని పేర్కొన్నారు.

ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు ముహూర్తం ఖరారు

- ఓటర్ల జాబితాల తయారీపై కమిషన్ కీలక ఆదేశాలు
- సెప్టెంబర్ 19న తుది జాబితా ప్రకటన
- లోపాలు లేకుండా ఎన్నికలకు పక్కా ఏర్పాట్లు

అమరావతి, సెప్టెంబర్ 09, (వాయువేగ న్యూస్)

ఆంధ్రప్రదేశ్‌లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణ దిశగా రాష్ట్ర ఎన్నికల సంఘం వడివడిగా అడుగులు వేస్తోంది. రాబోయే ఎన్నికలకు సంబంధించి ఫొటోలతో కూడిన పూర్తిస్థాయి ఓటర్ల జాబితాలను తక్షణమే సిద్ధం చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అధికారులను ఆదేశించారు. ఓటర్ల జాబితా రూపకల్పనలో ఎటువంటి లోపాలకు తావులేకుండా పక్కాగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. ప్రతి ఓటరుకు తన ఓటు హక్కు వినియోగించుకునేలా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సూచించారు. గ్రామీణ స్థాయిలో ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడమే లక్ష్యంగా కమిషన్ ముందుకు సాగుతోంది.

హరితాభివృద్ధిపై కీలక చర్చలు

- ఏపీ-గ్రీన్ అభివృద్ధిపై సమావేశం - పర్యావరణ పరిరక్షణకు సాంకేతికత వినియోగం
- సుస్థిర ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా కార్యాచరణ

02

APTEL/26/A4232
కందేరి వాయువేగ దినపత్రిక
ప్రజల చేతిలో ఆయుధం

నిత్యావసర ధరలు తగ్గించాలి : సీపీఐ

తొట్టంబేడు, సెప్టెంబర్ 9 (వాయువేగ న్యూస్)

సీపీఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు తొట్టంబేడు మండల కార్యదర్శి రుద్రపాకు శ్రీనివాసులు ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జె. తులసిరాజన్ మాట్లాడుతూ పెరిగిన నిత్యావసర ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. మండలంలోని రైతులు పండించిన అన్ని రకాల పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. అలాగే తొట్టంబేడు మండలంలోని ఎల్ఐసీ కాలనీ శ్మశానవాటికకు సర్వే నిర్వహించి హద్దులు చూపించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై అధికారులు వెంటనే స్పందించి పరిష్కార చర్యలు చేపట్టాలని సీపీఐ నాయకులు కోరారు. కార్యక్రమంలో మాసారపు నరసింహారావు, సుబ్బమ్మ, పరశురామయ్య, మధు, బాలాజీ, మాతమ్మ తదితరులు పాల్గొన్నారు.



'నిజం గెలిచింది'.. క్యాండిల్ వెలిగించి టీడీపీ శ్రేణుల సంఘీభావం

ఏర్పేడు, సెప్టెంబర్ 9 (వాయువేగ న్యూస్)

గత పాలకులు చేసిన అక్రమ అరెస్టుకు నిరసనగా, 'నిజం గెలిచింది' అనే నినాదంతో ఏర్పేడు మండల టీడీపీ కార్యాలయంలో పార్టీ శ్రేణులు క్యాండిల్ వెలిగించి మద్దతు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును అక్రమంగా అరెస్టు చేశారని టీడీపీ నాయకులు ఆరోపిస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల టీడీపీ అధ్యక్షుడు పేరం నాగరాజ నాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ డాక్టర్ రెడ్డివారి గురవారెడ్డి, సూరి నాయుడు, గాలి కృష్ణవేణి, యూనిట్ ఇన్‌చార్జీలు కేశినేని సుబ్రమణ్యం, రాచేటి సుబ్రమణ్యం, కేకే రమణ, బి. మునిరాజ యాదవ్, మాజీ ఎంపీపీ మురగయ్య, వెంకటస్వామి, వై. మనోహర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడుపై గత ప్రభుత్వం పెట్టిన కేసులు, అరెస్టుపై తమ నిరసనను వ్యక్తం చేశారు. న్యాయం, నిజం చివరకు గెలిచాయనే నినాదంతో క్యాండిల్ వెలిగించి సంఘీభావం తెలిపారు.

నిజం గెలిచింది.. ప్రజాస్వామ్యం నిలిచింది!

చంద్రబాబు అక్రమ అరెస్టుకు మూడేళ్లు..

'నిజం గెలిచింది' కార్యక్రమంలో డా. పనబాక లక్ష్మి

తిరుపతి, సెప్టెంబర్ 9 (వాయువేగ న్యూస్)

తెలుగుదేశం పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు మూడేళ్లు పూర్తయిన సందర్భంగా తిరుపతి నియోజకవర్గంలోని టౌన్ క్లబ్, ఎన్టీఆర్ సర్కిల్ వద్ద 'నిజం గెలిచింది' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తిరుపతి పార్లమెంట్ అధ్యక్షురాలు డా. పనబాక లక్ష్మి హాజరై మాట్లాడుతూ గత ప్రభుత్వం కక్ష సాధింపు చర్యల్లో భాగంగా చంద్రబాబుపై అక్రమ కేసులు నమోదు చేసి అరెస్టు చేసినప్పటికీ చివరకు నిజం, న్యాయమే గెలిచాయని అన్నారు. ఎన్ని కుట్రలు, ఇబ్బందులు ఎదురైనా ప్రజల కోసం చంద్రబాబు తన పోరాటాన్ని ఆపలేదని, అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన కోసం నిరంతరం కృషి చేస్తున్న ఆయనకు ప్రజల అండ ఎప్పటికీ ఉంటుందని పేర్కొన్నారు. "నిజం గెలిచింది.. ప్రజాస్వామ్యం గెలిచింది.. తెలుగుదేశం గెలిచింది" అని డా. పనబాక లక్ష్మి అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరసింహ యాదవ్, రాష్ట్ర సెక్రటరీ, శాప్ చైర్మన్ రవి నాయుడు, రాష్ట్ర సెక్రటరీ అన్నా అనిత, తిరుపతి నియోజకవర్గ ఇన్‌చార్జి జేబీ శ్రీనివాస్, ఎస్వీబీసీ చైర్మన్ శ్రీధర్ వర్మ, టీటీడీ బోర్డు సభ్యుడు జంగా కృష్ణమూర్తి, తిరుపతి పార్లమెంట్ కమిటీ సభ్యులు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అర్హులైన వృద్ధులకు భరోసా పెన్షన్లు అందేలా చూడాలి : బొజ్జల బృందమ్మ

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 9 (వాయువేగ న్యూస్)

స్థానిక ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆయన మాతృమూర్తి బొజ్జల బృందమ్మ 32వ వార్డు పరిధిలోని 106వ బూత్ బీపీ అగ్రహారం టర్నింగ్ వద్ద 'ఇంటింటికీ తెలుగుదేశం.. ఇంటింటికీ మీ బొజ్జల' కార్యక్రమంలో భాగంగా ఇంటింటా పర్యటించారు. ఈ సందర్భంగా బొజ్జల బృందమ్మ మాట్లాడుతూ ఈ నెల 7 నుంచి 16వ తేదీ వరకు కొత్త ఎన్టీఆర్ భరోసా పెన్షన్లకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారని తెలిపారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి అర్హులను గుర్తించి, సంబంధిత పెన్షన్ దరఖాస్తులను సచివాలయ అధికారులకు అందించేలా సహకరించాలని సూచించారు. అర్హులైన పేదలు, వృద్ధులకు అండగా నిలవాలని కోరారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఇచ్చిన హామీలు అమలవుతున్నాయా లేదా అనే విషయాలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీలతో పాటు రాష్ట్రంలో పలు సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని బొజ్జల బృందమ్మ తెలిపారు. కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షుడు జి. విజయ్‌కుమార్ నాయుడు, క్లస్టర్ ఇన్‌చార్జి కంటా రమేష్, పట్టణ ప్రధాన కార్యదర్శి కాసరం రమేష్, దేవస్థానం పాలకమండలి సభ్యుడు గోపి, టౌన్ డిల్లీబాబు, 32వ వార్డు ఇన్‌చార్జి పోలూరు శ్రీనివాసులురెడ్డి, 106వ బూత్ కన్వీనర్ ఎస్కే షాబుద్దీన్, పట్టణ ఆర్గనైజింగ్ సెక్రటరీ పాలపర్తి యశ్వంత్ ఆర్ముగం, మునిరాజా, మునికుమార్ తదితర టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మోదుగులపాలెం ఎస్సీ కాలనీ స్మశానవాటిక దారి సమస్యకు పరిష్కారం

గ్రామస్థులతో మాట్లాడి లైన్ క్లియర్ చేసిన అధికారులు, టీడీపీ నాయకులు

ఏర్పేడు, సెప్టెంబర్ 9 (వాయువేగ న్యూస్)

ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఆదేశాల మేరకు ఏర్పేడు మండలం మోదుగులపాలెం ఎస్సీ కాలనీకి చెందిన స్మశానవాటిక దారి సమస్యను పరిష్కరించేందుకు అధికారులు, టీడీపీ నాయకులు చర్యలు చేపట్టారు. మండల టీడీపీ అధ్యక్షుడు పేరం నాగరాజ నాయుడు ఆధ్వర్యంలో ఎంఆర్ఓ రాజశేఖర్ పర్యవేక్షణలో గ్రామస్థులతో మాట్లాడి స్మశానవాటికకు వెళ్లే దారిపై ఉన్న సమస్యలను పరిశీలించారు. గ్రామ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని స్మశానవాటికకు దారి సజావుగా ఉండేలా లైన్ క్లియర్ చేశారు. దీంతో మోదుగులపాలెం ఎస్సీ కాలనీ ప్రజలు స్మశానవాటికకు వెళ్లేందుకు ఎదుర్కొంటున్న ఇబ్బందులు తొలగనున్నాయని స్థానికులు తెలిపారు. సమస్య పరిష్కారానికి సహకరించిన అధికారులు, టీడీపీ నాయకులకు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జి కేశినేని సుబ్రమణ్యం, మునయ్య, రాంప్రసాద్, నాగూర్, రంగయ్య, చంగయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తీశ్వరాలయంలో 22 నుంచి పవిత్రోత్సవాలు

ఐదు రోజుల పాటు వైభవంగా నిర్వహణ..

దర్శన, ఆర్జిత సేవల్లో మార్పులు

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 9 (వాయువేగ న్యూస్)

శ్రీకాళహస్తీశ్వరస్వామి వారి దేవస్థానంలో సంప్రదాయబద్ధంగా నిర్వహించే పవిత్రోత్సవాలను ఈ ఏడాది సెప్టెంబర్ 22 నుంచి 26వ తేదీ వరకు ఐదు రోజుల పాటు వైభవంగా నిర్వహించనున్నట్లు దేవస్థానం అధికారులు తెలిపారు. పవిత్రోత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ యాగశాల నుంచి పట్టువస్త్రాలు, పట్టుపవిత్రాలు, పాదుకలు, సుగంధ ద్రవ్యాలు తదితర పూజా సామగ్రిని ఆలయ ప్రదక్షిణగా తీసుకువచ్చి శ్రీ వినాయకస్వామి, శ్రీ చెంగల్రాయస్వామి, శ్రీకాళహస్తీశ్వరస్వామి, శ్రీ జ్ఞానప్రసూనాంబ అమ్మవార్ల గర్భాలయాల్లో ఉంచి విశేష పూజలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 5.30 గంటల నుంచి రాత్రి 7.30 గంటల వరకు గర్భాలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుగుతాయి. ఈ సమయాల్లో అంతరాలయ దర్శనానికి అనుమతి ఉండదని అధికారులు తెలిపారు. దీంతో రూ.500 ప్రత్యేక దర్శనం (అంతరాలయ దర్శనం)ను ఆయా సమయాల్లో తాత్కాలికంగా నిలిపివేయనున్నారు. సాధారణంగా ఉదయం 10 గంటలకు నిర్వహించే ఉచ్చికాల అభిషేకాన్ని పవిత్రోత్సవాల సందర్భంగా ఉదయం 9.30 గంటలకు నిర్వహించనున్నారు. అలాగే సాయంత్రం దీపారాధన సేవా టికెట్లను కూడా తాత్కాలికంగా నిలిపివేయనున్నారు. సెప్టెంబర్ 22 నుంచి 26వ తేదీ వరకు వీఐపీ దర్శనానికి సంబంధించిన తట్ట, మేళం సేవలు ఉండవని అధికారులు తెలిపారు. సెప్టెంబర్ 26న ఎలాంటి ఆర్జిత సేవలు నిర్వహించబడవు. పవిత్రోత్సవాల సందర్భంగా దర్శన, సేవల్లో జరిగే మార్పులను భక్తులు గమనించి దేవస్థాన అధికారులకు సహకరించాలని, పవిత్రోత్సవాలను విజయవంతం చేయాలని దేవస్థానం పీఆర్వో విజ్ఞప్తి చేశారు.

చంద్రబాబును జైల్లో పెట్టిన అహంకారానికి ప్రజలే సమాధి కట్టారు

53 కొవ్వొత్తులతో 'నిజం గెలిచింది'.. కూరపాటి శంకర్‌రెడ్డి

బుచ్చినాయుడు కండ్రిగ, సెప్టెంబర్ 9 (వాయువేగ న్యూస్)

టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును గత ప్రభుత్వ హయాంలో 2023 సెప్టెంబర్ 9న అరెస్టు చేసిన ఘటనను నిరసిస్తూ సత్యవేడు నియోజకవర్గ టీడీపీ ప్రోగ్రామ్స్ కోఆర్డినేటర్ కూరపాటి శంకర్‌రెడ్డి పిలుపు మేరకు బుచ్చినాయుడు కండ్రిగ మండలంలో 'నిజం గెలిచింది' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. చంద్రబాబు 53 రోజుల పాటు జైల్లో ఉన్న రోజులను గుర్తుచేసుకుంటూ 53 కొవ్వొత్తులతో నిరసన చేపట్టి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా కూరపాటి శంకర్‌రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబును అక్రమంగా నిర్బంధించి రాక్షస ఆనందం పొందిన నాటి పాలకుల అహంకారానికి ప్రజలు ఎన్నికల్లో ఓటుతోనే సమాధానం చెప్పారని అన్నారు. అక్రమ నిర్బంధాలు, ప్రజా వ్యతిరేక నిర్ణయాలతో సాగిన జగన్ పాలనను ప్రజలు తిరస్కరించారని, సత్యవేడు నియోజకవర్గ ప్రజాతీర్పు నాటి అహంకార పాలనకు గట్టి గుణపాఠమని పేర్కొన్నారు. తిరుపతి పార్లమెంట్ మీడియా కోఆర్డినేటర్ కందేరి కార్తీక్ నాయుడు మాట్లాడుతూ కుట్రలు, కక్ష సాధింపులతో ప్రజా విశ్వాసాన్ని గెలుచుకోలేరని, నాటి పాలనలో జరిగిన అరాచకాలకు ప్రజలు ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పారని అన్నారు. కూరపాటి శంకర్‌రెడ్డి దిశానిర్దేశంలో నియోజకవర్గంలో టీడీపీని మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. మండల పార్టీ అధ్యక్షుడు చెంచురామ నాయుడు, క్లస్టర్ ఇన్‌చార్జ్ మునిచంద్ర నాయుడు, కో-క్లస్టర్ ఇన్‌చార్జ్ రమేష్, ఐటీడీపీ ప్రతినిధి విజయ్‌కుమార్, రవినాయుడు, కన్నయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

మొదటిపేజీ తరువాయి

గొడ్డలి పార్టీ కుట్రలను తిప్పికొడతాం: చంద్రబాబు

మాచవరం, సెప్టెంబర్ 09, (వాయువేగ న్యూస్)

కూటమి ప్రభుత్వం ప్రజలకు మేలు చేసేందుకు అహర్నిశలు శ్రమిస్తుంటే గొడ్డలి పార్టీ కుట్రలు పన్నుతోందని, జరుగుతున్న పరిణామాలను ప్రజలు నిశితంగా గమనించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. కోనసీమ జిల్లా పి గన్నవరం నియోజకవర్గం మాచవరం పండువారిపేటలో నిర్వహించిన మీ భూమి - మీ హక్కు గ్రామ సభలో పాల్గొన్న ముఖ్యమంత్రి రైతులకు పట్టాదార్ పాస్ బుక్ లను స్వయంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర విభజన వల్ల జరిగిన నష్టాలు, గత ప్రభుత్వ విధ్వంస పాలన, కూటమి ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలపై కూలంకషంగా ప్రసంగించారు. 2019-24 మధ్య కాలంలో రాష్ట్రానికి విభజన కంటే ఎక్కువ నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేస్తూ ప్రజల్లో చైతన్యం నింపారు. గత ప్రభుత్వ పాలనపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. రాజకీయ కక్షతోనే పోలవరం డయాఫ్రమ్ వాల్ ను గోదాట్లో కలిపేశారని, కాంట్రాక్టర్ ను మార్చకుండా ఉంటే 2021 నాటికే ప్రాజెక్టు పూర్తయ్యేదని ఘాటుగా విమర్శించారు. ఇప్పుడు కరవు పరిస్థితుల్లో ఆ ప్రాజెక్టు రాష్ట్రాన్ని ఆదుకునేదని, కానీ వారి కక్షపూరిత చర్యల వల్లే రాష్ట్రం తీవ్రంగా నష్టపోయిందని అన్నారు. గత పాలనలో బయటకు రావాలన్నా, మాట్లాడాలన్నా ప్రజలు భయపడే పరిస్థితి ఉండేదని, ఏపీపీఎస్సీ గ్రూప్-1 పేపర్లను ఏకంగా ఎలక్ట్రీషియన్లు, డ్రైవర్లతో దిద్దించి నిరుద్యోగుల జీవితాలతో ఆడుకున్నారని ఆరోపించారు. నాసిరకం మద్యంతో ప్రజల ఆరోగ్యాన్ని సర్వనాశనం చేశారని, కల్తీ మద్యం కారణంగా సుమారు 30 వేల మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారని సంచలన ఆరోపణ చేశారు. వైసీపీని గొడ్డలి పార్టీగా అభివర్ణిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నిప్పులు చెరిగారు. ప్రజల సమస్యలపై చర్చించమని అసెంబ్లీకి రమ్మంటే వచ్చేది లేదని మొండికేస్తున్నారని, గొడ్డలి పార్టీ అధ్యక్షుడు బయటకు వస్తే చాలు ఎక్కడికి వెళ్లినా హింసేనని ధ్వజమెత్తారు. రప్పా రప్పా అంటూ రౌడీయిజం చేస్తారని, ఫ్లెక్సీలకు పొట్టేళ్లను బలి ఇచ్చి హింసను ప్రేరేపిస్తారని మండిపడ్డారు. సామాజిక మాధ్యమాల్లో తమ కుటుంబ సభ్యులపై అసభ్యంగా రాతలు రాయిస్తారని, ఒక రాజకీయ పార్టీగా ప్రజలకు ఎలాంటి సందేశం ఇస్తున్నారని సూటిగా ప్రశ్నించారు. ఇలాంటి విధ్వంసక శక్తులను ప్రజలే తరిమికొట్టాలని, ప్రజాస్వామ్యంలో హింసకు తావు లేదని స్పష్టం చేశారు. శాంతిభద్రతల విషయంలో తాను ఎప్పుడూ కఠినంగానే వ్యవహరిస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్ఘాటించారు. గతంలో నక్సల్స్ సిద్ధాంతాన్ని తాను బలంగా వ్యతిరేకించానని, అలిపిరిలో తనపై క్లైమోర్ మైన్స్ పేల్చినా ప్రజల కోసమే నిరంతరం పనిచేస్తున్నానని తెలిపారు. ముఠా కక్షల విషయంలో మాట వినని తన సొంత పార్టీకి చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలను సైతం అరెస్టు చేయించిన చరిత్ర తనదని గుర్తు చేశారు.

సంపాదకుడు: కందేరి కార్తీక్

10 గురువారం
సెప్టెంబర్ , 2026

APTEL/26/A4232
కందేరి వాయువేగ దినపత్రిక
ప్రజల చేతిలో ఆయుధం

కక్ష రాజకీయాలకు కాలం చెల్లింది.. ప్రజా తీర్పుతో నిజం గెలిచింది!

సత్యవేడు సెప్టెంబర్ 09 (వాయువేగ న్యూస్ ప్రధినిది గురునాథం):

వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో రాజకీయ కక్ష సాధింపులతో ఎన్ని ఇబ్బందులు పెట్టినా, నిజాన్ని అణచివేయడం ఎవరి వల్లా కాదని, చివరికి ప్రజలే న్యాయం వైపు నిలుస్తారని సత్యవేడు మండల టీడీపీ నాయకులు పేర్కొన్నారు. సత్యవేడు నియోజకవర్గ ప్రోగ్రాం కోఆర్డినేటర్ కురపాటి శంకర్ రెడ్డి గారి ఆదేశాల మేరకు, సత్యవేడు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పరుచూరి శివకుమార్ గారి ఆధ్వర్యంలో మండల టీడీపీ కార్యాలయంలో 53 కొవ్వొత్తులతో 'నిజం గెలిచింది' విజయోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. రాజకీయ ప్రత్యర్థులను ఎదుర్కోలేక కేసులు, అరెస్టులు, కక్ష సాధింపు చర్యలను ఆశ్రయించిన వైఎస్సార్సీపీ రాజకీయాలకు ప్రజలు ఎన్నికల ద్వారా గట్టి సమాధానం ఇచ్చారని విమర్శించారు. అధికారం శాశ్వతం కాదు.. కక్ష సాధింపు రాజకీయాలు శాశ్వతం కాదు.. ప్రజల నమ్మకం, ప్రజా తీర్పే శాశ్వతం అని అన్నారు. నారా చంద్రబాబు నాయుడు గారి పోరాట స్పూర్తికి సంఘీభావంగా 53 కొవ్వొత్తులు వెలిగించి, 'నిజం గెలిచింది.. ధర్మం గెలిచింది' అంటూ నినాదాలు చేశారు. సత్యవేడు మండలంలో తెలుగుదేశం పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మస్తాన్, మాజీ క్లస్టర్ ఇన్‌చార్జ్ పరమశివం (బాషా), క్లస్టర్ ఇన్‌చార్జ్10 బాబు యాదవ్, క్లస్టర్ ఇన్‌చార్జ్09 అమసారెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, నాగలాపురం మార్కెట్‌యార్డు వైస్‌ప్రెసిడెంట్ పామంజి మురళి (చికెన్ చిన్నా), సత్యవేడు టౌన్ పార్టీ అధ్యక్షులు కోనయ్య,

సత్యవేడు మండల ప్రధాన కార్యదర్శి శివయ్య, తిరుపతి పార్లమెంట్ ఉపాధ్యక్షులు పామంజి వాసు, సూరుటుపల్లి ఆలయ సభ్యులు కృష్ణయ్య, సత్యవేడు నియోజకవర్గ యువత అధ్యక్షులు తులసి, నియోజకవర్గ యువత వైస్‌ప్రెసిడెంట్ కోపాల జగన్, సత్యవేడు మండల యువత అధ్యక్షులు దిలీప్, యూనిట్ ఇన్‌చార్జ్లు గణేష్, రూబెన్, బూత్ ఇన్‌చార్జ్ షణ్ముగం, హాస్పిటల్ కమిటీ సభ్యులు హేమభూషణం, టీడీపీ సీనియర్ నాయకులు రవీ, రాధయ్య, సత్యవేడు నియోజకవర్గ ఐటీడీపీ అధ్యక్షులు సంతోష్ నాయుడు, దాము, యువ నాయకులు నారాయణ,మౌన్‌రాజ్,ఎచీూఖీ తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు పృథ్వీరాజ్, దయ, హేమచరణ్ టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నాగలాపురం మండలం నిజం గెలిచింది' కార్యక్రమం

నాగలాపురం సెప్టెంబర్ 9:(వాయువేగ న్యూస్ ప్రతినిధి) నరేంద్ర రెడ్డి

కురపాటి శంకర్ రెడ్డి గారి ఆదేశాల మేరకు, నాగలాపురం మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు టీజేబీ ప్రణీత్ రెడ్డి గారి సూచన మేరకు నాగలాపురం మండలంలో 'నిజంగెలిచింది'కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారుచంద్రబాబు నాయుడు గారిని 53 రోజుల పాటు ప్రజలకు దూరం చేసిన ఘటనను గుర్తుచేసుకుంటూ 53 దీపాలతో 'నిజం గెలిచింది' కార్యక్రమాన్నినిర్వహించారు.ఈ కార్యక్రమానికి నాగలాపురం మండలంలోని టీడీపీ నాయకులు, జనసేన, బీజేపీనాయకులు, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్లు, పార్లమెంట్ నాయకులు, ఏఎంసీ ఛైర్మన్ మరియు ఏఎంసీ డైరెక్టర్లు, ఒకే విండో ఛైర్మన్, 19 మంది గ్రామ అధ్యక్షులు, ఇతర అధికార ప్రతినిధులు, ఐటీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ఖ

ధరల భారంతో సామాన్యుల అవస్థలు.. సీపీఐ ధర్నా

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 9 (వాయువేగ న్యూస్)

నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించి సామాన్య ప్రజలకు ఉపశమనం కల్పించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ రూరల్ మండల కార్యదర్శి మించల శివకుమార్, పట్టణ సహాయ కార్యదర్శి కోగిలి మునిచందు మాట్లాడుతూ ఉప్పు, పప్పు, వంట నూనె, పాలు, కూరగాయలతో పాటు పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలు పెరగడంతో సామాన్య కుటుంబాలపై ఆర్థిక భారం పెరిగిందన్నారు. ప్రభుత్వం వెంటనే ధరలను నియంత్రించి ప్రజలకు ఉపశమనం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షురాలు చారులత, గంగాభవాని, మునెమ్మ, గంగమ్మ, గీత, సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

నెట్ లేక.. సచివాలయంలో ప్రజలకు చుక్కలు!

పెన్షన్ పనికీ గంటల తరబడి నిరీక్షణ.. సిబ్బంది సొంత డేటాతో ఆన్‌లైన్ సేవలు.

రెండు సచివాలయాలకు డిజిటల్ అసిస్టెంట్ ఒక్కరే.

వరదయ్యపాలెం, సెప్టెంబర్ 9: వాయువేగ న్యూస్ ప్రతినిధి

–సల్మాన్: వరదయ్యపాలెం మండలంలోని మేజర్ పంచాయతీ సచివాలయంలో ఇంటర్నెట్ సౌకర్యం లేక ప్రభుత్వ సేవల కోసం వచ్చే ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. ముఖ్యంగా పెన్షన్ దరఖాస్తులు, ఇతర ఆన్‌లైన్ సేవల కోసం వచ్చిన లబ్ధిదారులు గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. నెట్ ఎప్పుడు వస్తుందో తెలియక పనులు వాయిదా వేసుకుని తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. వృద్ధులు, మహిళలు, దూర ప్రాంతాల నుంచి వచ్చే లబ్ధిదారులు ఈ సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒక్క పని కోసం పలుమార్లు సచివాలయానికి రావాల్సి రావడంతో ప్రయాణ ఖర్చులతో పాటు పనిదినం కూడా కోల్పోతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సచివాలయంలో ఇంటర్నెట్ లేకపోవడంతో సిబ్బంది తమ సొంత మొబైల్ డేటాను వినియోగించి ఆన్‌లైన్ సేవలు అందిస్తున్నట్లు సమాచారం. మరోవైపు సచివాలయానికి ఇంటర్నెట్ సౌకర్యం కోసం జనవరిలోనే రూ.1,000 బిల్లు చెల్లించినప్పటికీ ఇప్పటివరకు నెట్ అందుబాటులోకి రాలేదని వరదయ్యపాలెం ఈఓ తెలిపినట్లు సమాచారం. బిల్లు చెల్లించి నెలలు గడుస్తున్నా సమస్య పరిష్కారం కాకపోవడంపై ప్రజలు ప్రశ్నిస్తున్నారు. దీనికి తోడు మేజర్ పంచాయతీలోని రెండు సచివాలయాలకు ఒకే ఒక్క డిజిటల్ అసిస్టెంట్ ఉండటంతో ఆన్‌లైన్ పనుల నిర్వహణలో జాప్యం జరుగుతోందని స్థానికులు చెబుతున్నారు. సాంకేతిక సదుపాయం, సిబ్బంది కొరత కారణంగా ప్రభుత్వ సేవల కోసం వచ్చే ప్రజలే ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇంటర్నెట్ సమస్యను వెంటనే పరిష్కరించడంతో పాటు రెండు సచివాలయాలకు తగినంత డిజిటల్ సిబ్బందిని కేటాయించి ప్రజలకు సకాలంలో సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

శ్రీకాళహస్తి పరిధిలో జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు విస్తృత పర్యటన...

రైతులకు మద్దతు ధర దక్కేలా చర్యలు తీసుకోవాలని ఆదేశం...

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 09 వాయువేగ న్యూస్

ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర లభించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు ఆదేశించారు. జిల్లాలో ప్రస్తుతం ఎడగారు పంట కోతలు జోరందుకున్న నేపథ్యంలో జాయింట్ కలెక్టర్ శ్రీకాళహస్తి ఆర్‌డీఓ భాను ప్రకాష్ రెడ్డితో కలసి బుధవారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. పంట పొలాలను సందర్శించిన జాయింట్ కలెక్టర్, నేరుగా రైతులతో మాట్లాడి ప్రస్తుత పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జేసి మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర రైతులకు అందుతుందో లేదో రైతులతో మాట్లాడి తెలుసుకున్నారు. వ్యాపారులు, దళారులు ధర తగ్గించకుండా ప్రభుత్వం నిర్ణయించిన ధరకు ధాన్యం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. హార్వెస్టింగ్, నూర్పిడి, రవాణా, ధాన్యం విక్రయ సమయంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ధాన్యం కొనుగోళ్లను నిరంతరం పర్యవేక్షించాలని ఆర్‌డీఓను ఆదేశించారు. రైతుల ధాన్యం విక్రయాలు సులభతరంగా జరిగేలా జిల్లా యంత్రాంగం అన్ని చర్యలు తీసుకుంటోందని జాయింట్ కలెక్టర్ స్పష్టం చేశారు.

పోషకాహారమే ఆరోగ్యకరమైన సమాజానికి పునాది : డాక్టర్ హర్షవర్ధన్

సత్యవేడు, సెప్టెంబర్ 9 (వాయువేగ న్యూస్ ప్రతినిధి గురునాథం):

ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి పోషకాహారమే పునాది అని తిరుపతి జిల్లా సత్యవేడు మండలం దాసుకుప్పం పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ హర్షవర్ధన్ అన్నారు. బుధవారం దాసుకుప్పం పీహెచ్‌సీ కేంద్రంలో స్థానిక ఐసీడీఎస్ ఇన్‌చార్జ్ అధికారిణి జ్యోతి ఆధ్వర్యంలో పోషణ్ మాసం కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు సమతుల్య ఆహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ హర్షవర్ధన్ మాట్లాడుతూ చిన్నారుల ఎదుగుదల నుంచి గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికల ఆరోగ్యం వరకు ప్రతి దశలో సరైన పోషకాహారం కీలక పాత్ర పోషిస్తుందన్నారు. పోషకాహారం అంటే కేవలం కడుపు నింపుకోవడం కాదని, శరీరానికి అవసరమైన ప్రొటీన్లు, విటమిన్లు, ఖనిజ లవణాలు, ఇనుము, కాల్షియం తదితర పోషకాలు సమతుల్యంగా అందేలా ఆహారం తీసుకోవాలని సూచించారు. స్థానికంగా లభించే ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, పప్పులు, చిరుధాన్యాలు, గుడ్లు, పాలు తదితర పోషక విలువలు కలిగిన ఆహారాన్ని ప్రతిరోజూ తీసుకోవాలన్నారు. ఐసీడీఎస్ ఇన్‌చార్జ్ అధికారిణి జ్యోతి మాట్లాడుతూ తల్లీబిడ్డల ఆరోగ్యమే ప్రధాన లక్ష్యంగా పోషణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. గర్భిణులు, బాలింతలు, ఆరు నెలల నుంచి ఆరేళ్లలోపు చిన్నారులు, కిశోర బాలికలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారుల బరువు, ఎదుగుదలను పర్యవేక్షించడంతో పాటు గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై సూచనలు అందిస్తున్నామని, అనుబంధ పోషకాహారాన్ని పంపిణీ చేస్తున్నామని వివరించారు.

పోషకాహారం ప్రతి కుటుంబం బాధ్యత అని, ఆరోగ్యవంతమైన తరం దేశానికి బలమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దాసుకుప్పం పీహెచ్‌సీ ఎంపీహెచ్‌ఈఓ సుబ్రహ్మణ్యం, సూపర్‌వైజర్లు మురళి, శ్రీదేవి, స్టాఫ్ నర్సులు వనజ, అనిత, ల్యాబ్ టెక్నీషియన్ మురళి, అంగన్‌వాడీ వర్కర్లు రుక్మిణి, చంద్రమ్మ, పలువురు గర్భిణులు తదితరులు పాల్గొన్నారు.

మొదటిపేజీ తరువాయి

హరితాభివృద్ధిపై కీలక చర్చలు

మంగళగిరి, సెప్టెంబర్ 9, వాయువేగ న్యూస్

మంగళగిరిలోని అరణ్యభవన్‌లో ఏపీ–గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్సీ నాగబాబుతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అటవీ శాఖ ఐటీ అడ్వైజర్ పి. నాగబాబు, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడు డాక్టర్ సందీప్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో హరితాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణకు సంబంధించి పలు కీలక అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఏపీ–గ్రీన్ కార్యక్రమాల విస్తరణ, రాష్ట్రంలో పచ్చదనాన్ని పెంపొందించే చర్యలు, పర్యావరణ సమతుల్యతను కాపాడే ప్రణాళికలపై సమావేశంలో ప్రధానంగా చర్చ జరిగినట్లు వెల్లడించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రజల భాగస్వామ్యాన్ని పెంచే కార్యక్రమాలను మరింత బలోపేతం చేయాలని అభిప్రాయపడ్డారు.సాంకేతికత ఆధారిత పర్యావరణ పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరాన్ని సమావేశంలో ప్రస్తావించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ అటవీ సంపద సంరక్షణ, కాలుష్య నియంత్రణ, పర్యావరణ పర్యవేక్షణ వ్యవస్థలను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దే అంశాలపై చర్చించారు. రాష్ట్రంలో హరిత కవచాన్ని విస్తరించేందుకు చేపట్టాల్సిన కార్యక్రమాలు, మొక్కల పెంపకం, పర్యావరణ అవగాహన కార్యక్రమాల నిర్వహణపై కూడా అభిప్రాయాలు పంచుకున్నారు. పర్యావరణ పరిరక్షణలో ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం మరింత పెరగాల్సిన అవసరాన్ని గుర్తించారు.పర్యావరణహిత అభివృద్ధి కార్యక్రమాలను ప్రోత్సహించడంతో పాటు భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించే దిశగా చర్యలు చేపట్టాలని సమావేశంలో నిర్ణయించారు. ప్రకృతి వనరుల సంరక్షణతో పాటు అభివృద్ధి కార్యక్రమాలు సమతుల్యంగా సాగాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు. హరిత, సుస్థిర ఆంధ్రప్రదేశ్ నిర్మాణమే లక్ష్యంగా అన్ని సంబంధిత శాఖలు సమన్వయంతో ముందుకు సాగాలని సమావేశంలో పాల్గొన్న వారు పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణను ప్రజా ఉద్యమంగా మార్చేందుకు భవిష్యత్‌లో మరిన్ని కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు.

సంపాదకుడు: కందేరి కార్తీక్

10 గురువారం
సెప్టెంబర్ , 2026

APTEL/26/A4232
కందేరి వాయువేగ దినపత్రిక
ప్రజల చేతిలో ఆయుధం

గణేష్ ఉత్సవాలకు ముందస్తు అనుమతి తప్పనిసరి!

సింగిల్ విండో విధానంలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి: శ్రీ సిటీ ఎస్ఐ ప్రియాంక

వరదయ్యపాలెం, సెప్టెంబర్ 9 (వాయువేగ న్యూస్ ప్రతినిధి సల్మాన్)

రానున్న వినాయక చవితి, గణేష్ ఉత్సవాల సందర్భంగా విగ్రహ ప్రతిష్ఠ, మండపాల ఏర్పాటు, ఉత్సవాల నిర్వహణకు నిర్వాహకులు ముందస్తుగా అనుమతులు పొందాలని శ్రీ సిటీ ఎస్ఐ ప్రియాంక సూచించారు. ఉత్సవ కమిటీల సౌకర్యార్థం వివిధ శాఖల అనుమతులను ఒకే వేదిక ద్వారా పొందేందుకు సింగిల్ విండో ఆన్‌లైన్ పర్మిషన్ సిస్టమ్ అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. మండపం, విగ్రహ ప్రతిష్ఠకు సంబంధించిన వివరాలను ganeshutsav.net పోర్టల్‌లో నమోదు చేసి ముందస్తుగా ఆన్‌లైన్‌లో అనుమతికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. శాంతిభద్రతలు, ప్రజల భద్రత, ట్రాఫిక్ నియంత్రణతో పాటు ఇతర ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అవసరమైన అనుమతులు పొందిన అనంతరం మాత్రమే ఉత్సవాలు నిర్వహించాలని ఎస్ఐ స్పష్టం చేశారు. నిర్వాహకులు చివరి నిమిషంలో ఇబ్బందులు తలెత్తకుండా ముందుగానే దరఖాస్తు చేసుకుని అనుమతులు పొందాలని, ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీసులకు సహకరించాలని ఆమె కోరారు.

శ్రీకాళహస్తీశ్వరుడి హుండీ ఆదాయం రూ.1.51 కోట్లు

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 9 (వాయువేగ న్యూస్)

శ్రీకాళహస్తీశ్వరస్వామి వారి దేవస్థానంలో బుధవారం హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ లెక్కింపులో హుండీ ద్వారా మొత్తం రూ.1,51,82,310 నగదు ఆదాయం లభించినట్లు దేవస్థాన అధికారులు తెలిపారు. ఇందులో భారతీయ కరెన్సీ నోట్లు రూ.1,45,79,953, నాణేల రూపంలో రూ.6,02,357 లభించినట్లు పేర్కొన్నారు. అలాగే హుండీ ద్వారా 22 గ్రాముల బంగారం, 360 కిలోల వెండి, వివిధ దేశాలకు చెందిన 103 విదేశీ కరెన్సీ నోట్లు లభించినట్లు అధికారులు వెల్లడించారు. దేవస్థానం అధికారుల పర్యవేక్షణలో హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్, కార్యనిర్వహణాధికారి బి.కె. వెంకటేశులు, ఈఈ శ్రీనివాసరాజు, ఏఈఓలు, శివసేవకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పార్లపల్లి వద్ద కారుఆటో ఢీ.. ఒకరికి గాయాలు

తొట్టంబేడు, సెప్టెంబర్ 9 (వాయువేగ న్యూస్)

మండలంలోని పార్లపల్లి సమీపంలో బుధవారం కారు, ఆటో ఢీకొన్న ఘటనలో ఒకరికి గాయాలయ్యాయి. శ్రీకాళహస్తి వైపు వెళ్తున్న ఆటోను కారు ఢీకొనడంతో ఆటోలో ప్రయాణిస్తున్న పార్లపల్లికి చెందిన మునిశేఖర్ తలకు గాయాలయ్యాయి. వెంటనే అతడిని చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఘటనపై తొట్టంబేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

చీకటిపై వెలుగుల పోరాటం.. కుటుంబంతో దీపాలు వెలిగించిన బొజ్జల సుధీర్ రెడ్డి

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 9 (వాయువేగ న్యూస్)

గత వైసీపీ ప్రభుత్వ పాలనలో టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడిపై పెట్టిన కేసులు, ఆయన అరెస్టుకు నిరసనగా శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి తన నివాసంలో దీపాలు వెలిగించి నిరసన తెలిపారు. "చీకటి పాలనపై వెలుగుల విజయం" అనే సందేశంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గత ప్రభుత్వ తీరుపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నలభై ఏళ్లకు పైగా రాజకీయ ప్రస్థానంలో ప్రజలకు సేవ చేస్తూ, ఎంతోమందికి మార్గదర్శిగా నిలిచిన చంద్రబాబు నాయుడిని నాటి వైసీపీ ప్రభుత్వం అర్ధరాత్రి అరెస్టు చేయడం దారుణమని అన్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని రాజకీయ కక్షసాధింపు చర్యలకు పాల్పడి ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీశారని విమర్శించారు. చంద్రబాబు నాయుడిపై కేసులు పెట్టి అరెస్టు చేయడంతో పాటు టీడీపీ నాయకులు, కార్యకర్తలను అనేక విధాలుగా ఇబ్బందులకు గురిచేశారని ఆరోపించారు. నాడు రాష్ట్రంలో అరాచక పాలనతో చీకటి అలుముకుందని, అన్యాయాలు, అక్రమాలపై ప్రశ్నించే గొంతుకలను అణచివేసే ప్రయత్నాలు జరిగాయని అన్నారు. ఆ చీకటి పాలనకు ముగింపు పలికి ధర్మం, న్యాయానికి మద్దతుగా కుటుంబ సభ్యులతో కలిసి దీపాలు వెలిగించి నిరసన వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. ప్రజాస్వామ్యంలో అధికారం శాశ్వతం కాదని, ప్రజలే అంతిమ నిర్ణేతలని పేర్కొన్న ఆయన.. గత ప్రభుత్వ పాలనపై ప్రజలు ఎన్నికల్లో తమ ఓటు ద్వారా తగిన సమాధానం చెప్పారని అన్నారు. ప్రస్తుతం చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రంలో సుపరిపాలన, అభివృద్ధి వెలుగులు విరజిమ్ముతున్నాయని తెలిపారు. నాయకులను అరెస్టు చేసినంత మాత్రాన వారి ప్రజాభిమానాన్ని, ఆశయాలను అడ్డుకోలేరని నాటి ప్రభుత్వానికి ప్రజల తీర్పుతో స్పష్టమైందన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బొజ్జల సుధీర్ రెడ్డి కుటుంబ సభ్యులతో పాటు శ్రీకాళహస్తి నియోజకవర్గానికి చెందిన టీడీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని దీపాలు వెలిగించి సంఘీభావం తెలిపారు.

మీడియా ప్రతినిధిపై దాడి దురదృష్టకరం

దాడులను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రోత్సహించం : జనసేన నాయకుడు దండి నరేంద్ర

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 9 (వాయువేగ న్యూస్)

శ్రీకాళహస్తి పట్టణంలో ప్రింట్ మీడియా ప్రతినిధి శివపై వ్యక్తిగత, ఆస్తి వివాదాల నేపథ్యంలో ఆయన బంధువుల కుటుంబ సభ్యులు దాడి చేసిన ఘటనను జనసేన పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గ నాయకుడు దండి నరేంద్ర తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తూ సమాజానికి సేవ చేస్తున్న మీడియా ప్రతినిధుల భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ఏ వివాదమైనా చర్చల ద్వారా సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవాలి తప్ప దాడులకు పాల్పడటం ఏమాత్రం సమర్థనీయం కాదన్నారు. దాడిలో గాయపడిన శివను శ్రీకాళహస్తి ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో పరామర్శించి, వైద్యులను అడిగి ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నట్లు తెలిపారు. అనంతరం శివ భార్య, కుమారుడితో మాట్లాడి ధైర్యం చెప్పారు. శివ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మీడియా ప్రతినిధులతో పాటు సమాజానికి సేవలందించే అన్ని వర్గాలకు గౌరవం, రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మీడియా ప్రతినిధులపై దాడులను జనసేన పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రోత్సహించదని, అంగీకరించదని దండి నరేంద్ర స్పష్టం చేశారు.

అర్హులైన వృద్ధులకు 'భరోసా' కల్పించాలి

ఇంటింటికీ వెళ్లి అర్హులను గుర్తించి పెన్షన్ దరఖాస్తులు చేయించాలి : బొజ్జల బృందమ్మ

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 9 (వాయువేగ న్యూస్)

శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆయన తల్లి బొజ్జల బృందమ్మ 32వ వార్డు పరిధిలోని 106వ బూత్ బీపీ అగ్రహారం టర్నింగ్ వద్ద 'ఇంటింటికీ తెలుగుదేశం.. ఇంటింటికీ మీ బొజ్జల' కార్యక్రమంలో భాగంగా ఇంటింటా పర్యటించారు. ఈ సందర్భంగా బొజ్జల బృందమ్మ మాట్లాడుతూ ఈ నెల 7 నుంచి 16వ తేదీ వరకు కొత్త ఎన్టీఆర్ భరోసా పెన్షన్లకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారని తెలిపారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి అర్హులను గుర్తించి, సంబంధిత పెన్షన్ దరఖాస్తులను సచివాలయ అధికారులకు అందించేలా సహకరించాలని సూచించారు. అర్హులైన పేదలు, వృద్ధులకు అండగా నిలవాలని కోరారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఇచ్చిన హామీలు అమలవుతున్నాయా లేదా అనే విషయాలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీలతో పాటు రాష్ట్రంలో పలు సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని బొజ్జల బృందమ్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షుడు జి. విజయ్‌కుమార్ నాయుడు, క్లస్టర్ ఇన్‌చార్జి కంటా రమేష్, పట్టణ ప్రధాన కార్యదర్శి కాసరం రమేష్, దేవస్థానం పాలకమండలి సభ్యుడు గోపి, టౌన్ డిల్లీబాబు, 32వ వార్డు ఇన్‌చార్జి పోలూరు శ్రీనివాసులురెడ్డి తదితర టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

45 ఏళ్లుగా నివాసం.. సొంత ఇంటి స్థలం లేదు.. షికారుల సమస్యలు తెలుసుకున్న కాంగ్రెస్ నేతలు

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 9 (వాయువేగ న్యూస్)

పట్టణంలోని సాయిరాం హాల్ సర్కిల్ వద్ద నివాసం ఉంటున్న షికారుల సమస్యలను కాంగ్రెస్ నాయకులు అడిగి తెలుసుకున్నారు. సుమారు 45 ఏళ్లుగా శ్రీకాళహస్తిలో నివసిస్తున్నప్పటికీ తమకు సొంత ఇల్లు, ఇంటి స్థలం లేదని వారు కాంగ్రెస్ నాయకులకు వివరించారు. మొత్తం 10 కుటుంబాలకు చెందిన 26 మందిలో 24 మందికి ఇంటి స్థలాలు, అర్హులకు పెన్షన్లు మంజూరు చేయాలని కోరారు. అలాగే ఓటు హక్కుకు సంబంధించిన సమస్యలను కూడా నాయకుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమస్యలను జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు బాలగురువం బాబు, నియోజకవర్గ సమన్వయకర్త తలపా దామోదర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని కాంగ్రెస్ నాయకులు హామీ ఇచ్చారు.

Edited Printed Published & Owned by kanderi Karthik D. No: 1/87, Karanimitta, B.N. Kandriga Mandal, Tirupati District, Andhra pradesh, Published at VSAR Publications, D. No. 403 Panta Street, Tirupati District, Andhra Pradesh. EDITOR KANDERI KARTHIK, RNI. NO. ATPEL/26/A4232